సాక్షి రంగారెడ్డి

సోమవారం । 11 । మార్చి । 2024



పేదల సంక్షేమమే ధ్యేయం

పేద ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్‌ పార్టీ ధ్యేయమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

8లో▸



పేకాట రాయుళ్ల అరెస్టు

రాజేంద్రనగర్‌ ఎస్‌ఓటీ, శంకర్‌పల్లి పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు.

8లో▸



సమస్యల పరిష్కారానికి కృషి

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు.

8లో▸

న్యూస్‌రీల్‌

నేడు మీర్‌పేట మేయర్‌పై అవిశ్వాసం

మీర్‌పేట: మున్సిపల్‌ కార్పొరేషన్‌ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతూ గత నెల 22న కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు చెందిన 31 మంది కార్పొరేటర్లు కలెక్టర్‌కు లేఖ అందజేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు తీర్మానం విషయమై సోమవారం కార్పొరేషన్‌ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. దీనికి కందుకూరు ఆర్‌డీఓ సూరజ్‌కుమార్‌ ప్రిసైడింగ్‌ అధికారిగా వ్యవహరించనున్నారు. అవిశ్వాసానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆదివారం అధికారులు తెలిపారు.

మాలెపల్లి గ్రామాన్ని సందర్శించిన డీపీఓ



మాలెపల్లి గ్రామంలో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న డీపీఓ సురేశ్‌మోహన్‌

ఆమనగల్లు: మండల పరిధిలోని మాలెపల్లి గ్రామాన్ని ఆదివారం జిల్లా పంచాయతీ అధికారి వి.సురేశ్‌మోహన్‌ సందర్శించారు. గ్రామంలో నిర్మించిన డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, నర్సరీ, పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత, స్థానికులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



బీజేపీలో చేరుతున్న వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్‌: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీలను బొంద పెట్టాలని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాంధార్‌ఖాన్‌పేట్‌, లింగారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ, పెద్దవేడు గ్రామాలకు చెందిన 35 మంది వివిధ పార్టీల నాయకులు ఆదివారం బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు సమష్టిగా విజయానికి కృషి చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి 350 కన్నా ఎక్కువ సీట్లను గెలుపొందుతుందని ఆయన జోస్యం చెప్పారు. చేవెళ్ల లోక్‌సభ పరిధిలో బీజేపీ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ రత్నం, పార్టీ మండల అధ్యక్షుడు కిరణ్‌, రాము, కూతురు మహేందర్‌, కృష్ణ, పొన్న రాజీవ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, జగదీశ్‌గౌడ్‌, రవిగౌడ్‌, జనార్దన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, క్యామ నారాయణ, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టీనేజ్‌ గర్ల్‌'లో కౌమార భావోద్వేగాలు



మణికొండ: పద్నాలుగు ఏళ్ల బాలిక.. కవిత్వాలతో కూడిన పుస్తకం రాయడం అభినందనీయమని ఏఐజీ ఆస్పత్రి చైర్మన్‌ డాక్టర్‌ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. కోకాపేట జయభేరి పీక్‌లో ఆదివారం సాయంత్రం 'మ్యూజింగ్‌ ఆఫ్‌ ఏ టీనేజ్‌ గర్ల్‌' కవితా పుస్తకాన్ని ఆయనతో పాటు సైంట్‌ సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్‌ బీవీఆర్‌ మోహన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి, ఏఎస్‌సీఐ చైర్మన్‌ కె.పద్మనాభయ్య ఆవిష్కరించారు. ఓక్రిడ్జ్‌ స్కూల్‌లో చదువుతున్న సంజన సోమవరపు ఈ పుస్తకాన్ని రచించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుస్తకంలోని కవిత్వం కౌమార భావోద్వేగాలు సమ్మిళితమై ఉన్నాయన్నారు. అనంతరం సంజన మాట్లాడుతూ.. తన తాత, రిటైర్డ్‌ లెఫ్టినెంట్‌ జనరల్‌ హరిప్రసాద్‌ నుంచి కవిత్వం రాయాలన్న ప్రేరణ కలిగిందన్నారు. పుస్తకాన్ని తన ఉపాధ్యాయురాలు రోసలిండ్‌, తన తాతకు అంకితం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంజన తల్లిదండ్రులు రేఖ, శశి, బంధుమిత్రులు పాల్గొన్నారు.

'గులాబీ'లో గుబులు!

చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి పోటీకి వెనుకంజ

- సిట్టింగ్‌ ఎంపీ సహా ఆసక్తి చూపని కీలక నేతలు
- అంతర్మథనంలో బీఆర్‌ఎస్‌ అధిష్ఠానం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ బరిలో నిలిచేందుకు ఉమ్మడి జిల్లా గులాబీ నేతలు వెనుకాడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ ఘోరపరాజయం పాలవడం.. తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తుండటం.. నిన్న మొన్నటి వరకు వెంట నడిచిన నేతలంతా ఒకరి తర్వాత మరొకరు పార్టీని వీడుతుండటం కలవరానికి గురి చేస్తోంది. గ్రామాల్లోకి వెళ్తే కనీసం పలకరించే కార్యకర్తలు లేకపోవడం.. ఒక వేళ బరిలోకి దిగి, ప్రత్యర్థికి బలమైన పోటీ ఇచ్చినా ఆ తర్వాత అధికార కాంగ్రెస్‌ నుంచి ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందోననే భయం ఆయా నేతల్లో వెంటాడుతుండటం.. ఎన్నికల్లో భారీగా ఖర్చు చేయాల్సి వస్తుండటం.. గెలుపుపై ధీమా లేకపోవడంతో పోటీకి వెనుకాడుతున్నట్లు తెలిసింది. నిజానికి చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్‌ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పేరును నెల రోజుల క్రితమే అధిష్ఠానం ఖరారు చేసినప్పటికీ.. ఇటీవల ఆ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలతో ఆయన పోటీకి వెనుకాడుతున్నట్టు తెలుస్తోంది. తన అయిష్టతను ఇప్పటికే పార్టీ అధిష్ఠానానికి చెప్పినట్లు సమాచారం.

ప్రచారంలో 'కొండా' ముందంజ

బీజేపీ ఇప్పటికే తమ అభ్యర్థిని ఖరారు చేసింది. మొదటి జాబితాలోనే మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరును ప్రకటించింది. ఇతర పార్టీల అభ్యర్థులతో పోలిస్తే ఆయన ప్రచారంలో కొంత ముందంజలో ఉన్నారు. ఆయన రోజుకో నియోజకవర్గంలో పర్యటిస్తూ పోలింగ్‌ బూత్‌ల వారీగా పార్టీ శ్రేణులతో మమేకమవుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొంది తీరాలని బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌లోని అసంతృప్త నేతలను పార్టీలో చేర్చుకుంటున్నారు. వివిధ పొలిటికల్‌ ఏజెన్సీలతో ఎప్పటిప్పుడు సర్వేలు చేయించుకుంటున్నారు. పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ బలమైన నేతలను గుర్తించి, వారిని తన వైపు తిప్పుకొంటున్నారు. సంస్థాగతంగా పట్టు సాధించేందుకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. రాజకీయంగా వివాదరహితుడిగా గుర్తింపు పొందిన కొండ విశ్వేశ్వర్‌రెడ్డి ప్రధానంగా ప్రధాని మోదీ, పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలే ప్రధానంగా ప్రచారం సాగిస్తున్నారు.

కాంగ్రెస్‌లో కొనసాగుతున్న ఉత్కంఠ

ఎలాగైనా చేవెళ్లను గెలిచి తీరాలని సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఈ స్థానంపై మొదటి నుంచి ఆసక్తిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌కు చెక్‌ పెట్టాలని భావించిన ఆయన.. ఆ మేరకు ఉమ్మడి జిల్లాలో బలమైన నేతగా గుర్తింపు పొందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి దంపతులను పార్టీలోకి ఆహ్వానించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌గా రెండుసార్లు గెలుపొంది, ప్రస్తుతం వికారాబాద్‌ జిల్లా పరిషత్‌ చైర్‌ పర్సన్‌గా కొనసాగుతున్న పట్నం సునీతారెడ్డికి ఎంపీ టికెట్‌ ఆఫర్‌ చేయడంతో వారు కూడా ఏమీ ఆలోచించకుండా అప్పటి వరకు కొనసాగిన బీఆర్‌ఎస్‌ను వీడి ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. ఆరు గ్యారంటీల పథకం అమల్లో భాగంగా ఇటీవల చేవెళ్ల కేంద్రంగా నిర్వహించిన గృహజ్యోతి పథకం ఆవిష్కరణ సభకు పట్నం దంపతులే అన్నీ తామై వ్యవహరించడం విశేషం. చేవెళ్ల నుంచి పట్నం సునీతారెడ్డి పోటీ చేయబోతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి అదే రోజు పార్టీ శ్రేణులకు పరోక్ష సంకేతాలు కూడా ఇచ్చారు. శుక్రవారం ఏఐసీసీ విడుదల చేసిన మొదటి జాబితాలో ఆమె పేరు కూడా ఉండటం, ప్రధాన చానళ్లలోనే కాకుండా సోషల్‌ మీడియాలోనూ ఇదే అంశం చక్కర్లు కొట్టడం, తీరా కేసీ వేణుగోపాల్‌ ప్రెస్‌మీట్‌లో చేవెళ్ల ప్రస్తావన లేకపోవడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఏఐసీసీ విడుదల చేసిన మొదటి జాబితాలో ప్యారాచూట్‌ లీడర్ల పేర్లు ఉంటే పార్టీలో వేరే సంకేతాలు వెళ్తాయని భావించి.. తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిసింది. రెండో జాబితాలో పేరు వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇతర పార్టీల నుంచి మరో బలమైన నేత కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు, ఆయన కోసమే సునీతపేరును తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు ప్రచారం కూడా జరుగుతోంది. ఏదీ ఏమైనా చేవెళ్ల కాంగ్రెస్‌ అభ్యర్థిత్వం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

అభ్యర్థి కోసం అన్వేషణ..

ఆయన స్థానంలో ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక నేత, మాజీ మంత్రి పి.సబితారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డిని బరిలోకి దించాలని భావించింది. కాంగ్రెస్‌ నుంచి ఆయన సమీప బంధువు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి సునీతారెడ్డి పోటీలో ఉండనుండటం, ప్రస్తుత పరిస్థితుల్లో ఆమెకు పోటీగా నిలబడితే రెండు కుటుంబాల మధ్య వైరం తారాస్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందని భావించి పోటీకి ఆయన కూడా నిరాక రిస్తున్నట్లు తెలిసింది. ఇక్కడే ఉంటే అధిష్ఠానం తనపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉండటంతో ఆయన కొంతకాలంగా అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. ప్రత్యామ్నాయంగా మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్‌ తనయుడిని బరిలోకి దించాలని భావించినప్పటికీ ప్రస్తుతం మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన కూడా ఇందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ కంటే బీఆర్‌ఎస్‌కే 80 వేలకుపైగా ఓట్లు వచ్చాయి. ఏ రకంగా చూసినా బీఆర్‌ఎస్‌కే ఎక్కువ ఓటు బ్యాంకు ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాలోని కీలక నేతలంతా ఇక్కడి నుంచి పోటీకి భయపడుతుండటంతో అధిష్ఠానం అంతర్మథనంలో పడింది. సమీప జిల్లాల్లోని ఆర్థికంగా, సామాజికంగా బలమైన అభ్యర్థి కోసం అన్వేషించే పనిలో నిమగ్నమైంది.



దుబ్బకుంట.. కబ్జాదారుల కంట

- కట్టను చెరిపేసి.. ప్లాట్లుగా మార్చేసి..
- ఓ రియల్‌ వ్యాపారి ఆక్రమణ పర్వం
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి
- లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరిక

తుర్కయంజాల్‌: పురపాలక సంఘం పరిధిలో చెరువులు, కుంటల అన్యాక్రాంతానికి అడ్డుకట్ట పడడం లేదు. వీటిని రక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. తుర్కయంజాల్‌ పాత గ్రామానికి ఆనుకుని దుబ్బ కుంట ఉంది. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఈ కుంటపై ఓ బడా రియల్‌ వ్యాపారి కళ్లు పడ్డాయి. ఇంకేముంది కట్టను చెరిపేసి ప్లాట్లుగా మార్చే ప్రక్రియను రెండు, మూడు రోజులుగా వేగవంతం చేశాడు. 15 ఏళ్ల క్రితం ఇలాగే ప్లాట్లుగా మార్చడానికి ప్రయత్నించగా స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో వెనకడుగు వేశాడు. ప్రస్తుతం అక్కడ భూమి ధర గజం రూ.40వేల వరకు పలుకుతుండటంతో మరోసారి దీన్ని కాజేయాలని కుట్ర పన్నారు.

కట్ట ధ్వంసం

ప్రభుత్వ సర్వే నంబర్‌ 631తో పాటు, పట్టా సర్వే నంబర్‌ 612లో ఈ కుంట విస్తరించి ఉంది. సుమారు 30 గుంటల విస్తీర్ణంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న ఈ కుంట కట్టను జేసీబీల సాయంతో తవ్వించి, చదును చేసి హద్దు రాళ్లను నాటారు. అయినా ఇరిగేషన్‌, రెవెన్యూ, మున్సిపల్‌ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడ లేదు. కళ్ల ముందే కుంట అన్యాక్రాంతం అవుతుంటే బాధగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కుంటను కాపాడి, ఆక్రమణకు యత్నిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు స్పందించని పక్షంలో సోమవారం నుంచే ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు 'సాక్షి'కి తెలిపారు.

మా రికార్డుల్లో లేదు

మా రికార్డుల్లో దుబ్బ కుంట లేదు. కాబట్టి మేం కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోలేం. మరోసారి రెవెన్యూ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

– ఉషారాణి, ఇరిగేషన్‌ డీఈ

చర్యలు తీసుకుంటాం

చెరువు కట్టను ధ్వంసం చేసిన విషయం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. మా సిబ్బందిని అక్కడికి పంపించి చర్యలు తీసుకుంటాం. సర్వేయర్‌తో సర్వే చేపట్టి హద్దులు నిర్ణయిస్తాం.

– రవీందర్‌దత్‌, తహసీల్దార్‌, అబ్దుల్లాపూర్‌మెట్‌



ఓబీసీ మోర్చా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

విశ్వకర్మ పథకంతో పేదలకు మేలు

ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప

పహాడీషరీఫ్‌: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకం పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప అన్నారు. మామిడిపల్లి రంగనాయకుల కాలనీలో మాజీ కౌన్సిలర్‌ ఈరంకి వేణు కుమార్‌ గౌడ్‌ అధ్యక్షతన ఆదివారం ఓబీసీ మోర్చా జిల్లా స్థాయి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరప్ప మాట్లాడుతూ.. వెనుకబడిన కులాల వారి కోసం ప్రధాని నరేంద్ర మోదీ విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తూ పేదలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మోదీని మూడోసారి ప్రధానిగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దద్దుల లక్ష్మీనారాయణ, సోషల్‌ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి సార కుమార్‌, జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి వేణు గౌడ్‌, జిల్లా అధికార ప్రతినిధులు నరసింహ గౌడ్‌, శ్రీశైలం యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన మంత్రి జూపల్లి



అంబులెన్స్‌కు సమాచారం ఇస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఫిట్స్‌ వచ్చి రోడ్డుపై పడిపోయిన వ్యక్తిని ఆస్పత్రికి తరలింపు

షాద్‌నగర్‌: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడికి ఫిట్స్‌ వచ్చి రోడ్డుపై పడిఉండగా అటుగా వెళ్తున్న మంత్రి జూపల్లి గమనించి కాన్వాయ్‌ ఆపి ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఈ ఘటన షాద్‌నగర్‌ పరిధిలోని రాయికల్‌ టోల్‌ ప్లాజా సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబ్‌నగర్‌ జిల్లా రాజాపూర్‌కు చెందిన నాగేందర్‌ ఆదివారం ఉదయం సొంత పనినిమిత్తం తన ద్విచక్ర వాహనంపై షాద్‌నగర్‌ వచ్చాడు. తిరుగు పయనంలో ఇంటికి వెళ్తుండగా రాయికల్‌ టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే ఫిట్స్‌ వచ్చి జాతీయ రహదారిపై కింద పడిపోయి గిలిగిలా కొట్టుకున్నాడు. అదే సమయంలో హైదరాబాద్‌ నుంచి కొల్లాపూర్‌ వెళ్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు రోడ్డుపై పడి ఉన్న యువకుడిని గమనించాడు. వెంటనే తన కాన్వాయ్‌ని ఆపి కింద పడిన యువకుడి వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నాడు. స్వయంగా అంబులెన్స్‌కు ఫోన్‌ చేసి యువకుడిని షాద్‌నగర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంత్రి చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తుర్కయంజాల్‌: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చీఫ్‌ కంట్రోలర్‌ ఆఫ్‌ మైన్స్‌ (ఇన్‌చార్జి), ఇండియన్‌ బ్యూరో ఆఫ్‌ మైన్స్‌ పీఎస్‌ శర్మ అన్నారు. తుర్కయంజాల్‌లోని వీఎంఆర్‌ గార్డెన్స్‌లో ఓ సిమెంట్‌ ఇండస్ట్రీస్‌ లిమిటెడ్‌ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మైన్స్‌ ఎన్విరాన్‌మెంట్‌ అండ్‌ మినరల్‌ కన్జర్వేషన్‌ కౌన్సిల్‌ 29వ వారోత్సవాల ముగింపు, అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రకృతికి విరుద్ధంగా పనులు చేపట్టకూడదని, దానిని కాపాడుకుంటూ మైనింగ్‌ చేపట్టాలని సూచించారు. గనుల్లో పనిచేయడంలో యంత్రాలు ఎన్ని ఉన్నా, కార్మికుల పాత్ర కీలకమైందని గుర్తుచేశారు. మైనింగ్‌ చేపట్టే ప్రాంతాలకు దగ్గర్లో ఉన్న ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని 104 గనులను పరిశీలించినట్టు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ఖనిజ సంరక్షణ రంగంలో విశేష కృషి చేసినందుకు గాను ఉద్యోగులకు పర్యావరణ్‌ బంధు, మినరల్‌ కన్జర్వేషన్‌ బంధు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో మైన్స్‌ కంట్రోలర్‌ వి. జయకృష్ణ బాబు, రీజినల్‌ కంట్రోలర్‌ ఆఫ్‌ మైన్స్‌ ఆర్‌ఆర్‌ డోంగ్రే తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్‌ శర్మ

ఆత్మహత్య చేసుకుంటున్నానని 100కు డయల్‌

సకాలంలో సీపీఆర్‌ చేసి ప్రాణాలు కాపాడిన పోలీసులు



జగన్‌కు సీపీఆర్‌ చేస్తున్న పోలీసు సిబ్బంది

మీర్‌పేట: అర్ధ రాత్రి ఓ వ్యక్తి 100కు డయల్‌ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పడంతో సకాలంలో స్పందించిన పోలీసులు సీపీఆర్‌ చేసి ఆ వ్యక్తిని కాపాడారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బడంగ్‌పేటకు చెందిన జగన్‌ శనివారం అర్ధరాత్రి 100కు డయల్‌ చేసి తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలిపాడు. సమాచారం అందుకుని నైట్‌ డ్యూటీలో ఉన్న హోంగార్డు నర్సింహ, కానిస్టేబుల్స్‌ సూర్యనారాయణ, నాగరాజు, రమావత్‌ రవి వెంటనే అతని ఇంటికి చేరుకున్నారు. అప్పటికే జగన్‌ ఫ్యాన్‌కు వేలాడుతూ కొన ఊపిరితో కనిపించాడు. వెంటనే కిందికి దించిన వారు సీపీఆర్‌ చేసి అతని ప్రాణాలను కాపాడారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించి సీపీఆర్‌ చేసి ప్రాణాలు కాపాడిన పోలీసులకు జగన్‌ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ కలహాలతోనే జగన్‌ ఆత్మహత్యకు యత్నించినట్లు ఇన్‌స్పెక్టర్‌ కాశీవిశ్వనాథ్‌ తెలిపారు.

గెలిపిస్తే లోక్‌సభలో వాణి వినిపిస్తా

సీడబ్ల్యూసీ సభ్యుడు, మహబూబ్‌నగర్‌ లోక్‌సభ కాంగ్రెస్‌ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

షాద్‌నగర్‌: పాలమూరు ప్రజా గొంతును లోక్‌సభలో వినిపిస్తానని సీడబ్ల్యూసీ సభ్యుడు, మహబూబ్‌నగర్‌ లోక్‌సభ కాంగ్రెస్‌ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. షాదనగర్‌ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహబూబ్‌నగర్‌ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేల ఆశీస్సులతో అధిష్ఠానం తనకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి చేసి పార్టీకి విజయాన్ని అందించారో అదే విధంగా లోక్‌సభ ఎన్నికల్లోనూ రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే నేత చల్లా వంశీచందర్‌రెడ్డి అని అన్నారు. వివిధ పార్టీల నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌ పార్టీలో చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, నాయకులు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, బాబర్‌ఖాన్‌, కొంకళ్ల చెన్నయ్య, బాల్‌రాజ్‌గౌడ్‌, రఘు, హరినాథ్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీవ్యాధులపై అవగాహన అవసరం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

గచ్చిబౌలి: దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధిపై ప్రజల్లో మరింత అవగాహన అవసరమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌ రెడ్డి అన్నారు. ఆదివారం గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఏషియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ నెఫ్రాలజీ అండ్‌ యూరాలజీ(ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా నిర్వహించిన 'ద రన్‌ ఫర్‌ కిడ్నీ హెల్త్‌ ఫర్‌ ఆల్‌' కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాయామం, రన్నింగ్‌ ద్వారా మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ఏఐఎన్‌యూ నెఫ్రాలజిస్ట్‌ డాక్టర్‌ వరుణ్‌ మాట్లాడుతూ కిడ్నీవ్యాధులపై అవగాహన పెంచడమే కాకుండా మంచి ఫలితాలను రాబట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలను గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఐఎన్‌యూ డాక్టర్లు మల్లికార్జున్‌, డాక్టర్‌ పీసీ రెడ్డి, డాక్టర్‌ దీపక్‌ రాగూరి, డాక్టర్‌ క్రాంతి, డాక్టర్‌ తైఫ్‌ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



మల్లన్న జాతరలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి



బండరాయికి పూజలు చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్‌: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లన్న జాతరలో బండలాగుడు పోటీలనుఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలన్నారు. మనిషి మనిషిలా బతకడం నేర్పేదే భగద్గీత అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ రత్నం, మండల అధ్యక్షుడు కిరణ్‌, బీజేపీ నాయకులు రాము, కూతురు మహేందర్‌, కృష్ణ, పొన్న రాజీవ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, జగదీశ్‌గౌడ్‌, రవిగౌడ్‌, జనార్దన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, క్యామ నారాయణ, నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ జయమ్మ వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు లింగం, సులోచన, శ్రీనివాస్‌గౌడ్‌, మల్లేష్‌, తదితరులున్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత ఆత్మహత్య

మొయినాబాద్‌: వరకట్నం వేధింపులు తాళలేక వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని చిలుకూరు రాజీవ్‌ గృహకల్ప క్వాటర్స్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్‌కు చెందిన లావణ్య(18)ని, సంగారెడ్డి జిల్లా చెర్లగూడెంకు చెందిన పందిగోటే రవి(22)కు ఇచ్చి ఐదు నెలల క్రితం పెళ్లి చేశారు. జీహెచ్‌ఎంసీలో ఆటోడ్రైవర్‌గా పనిచేసే రవి మొయినాబాద్‌ మండలంలోని చిలుకూరులో ఉన్న రాజీవ్‌ గృహకల్ప క్వాటర్స్‌లో భార్యతో కలిసి ఉంటున్నాడు. పెళ్లైన నాలుగు నెలల పాటు బాగానే ఉన్న రవి నెల రోజుల నుంచి చిన్న చిన్న విషయాలకు భార్యతో గొడవపడి ఆమెను కొడుతున్నాడు. పెళ్లి సమయంలో కట్నం ఇవ్వలేదని.. కట్నం తీసుకురావాలని భార్యను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో రవి తన అత్తగారు భీమమ్మకు ఫోన్‌ చేసి మీ కూతురు నాతో గొడవ పడిందని చెప్పాడు. ఉ.9 గంటల సమయంలో భీమమ్మ చెల్లెలు ఎల్లమ్మ వచ్చి చూసేసరికి లావణ్య ఇంట్లోని సీలింగ్‌ ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది. దగ్గరకు వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు తల్లి భీమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

సైబర్‌ నేరాలతో అప్రమత్తత

మోకిల ఎస్సై కోటేశ్వర్‌ రావు

శంకర్‌పల్లి: సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోకిల ఎస్సై కోటేశ్వర్‌ రావు పేర్కొన్నారు. కొండకల్‌ గ్రామంలో ఆదివారం సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్‌ నేరాల బారిన పడి ఎంతో మంది అభాగ్యులు అప్పుల పాలు కావడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్‌ నేరగాళ్లు అపరిచితమైన నంబర్లతో లింక్‌లు పంపుతారని, వాటిపై క్లిక్‌ చేయకూడదని తెలిపారు. వాట్సాప్‌ గ్రూపుల్లో వచ్చే నంబర్ల లింక్‌లపై కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లిలో ఆదివారం సాయంత్రం యాచారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. త నిఖీల్లో యాదగిరి అనే వ్యక్తి అక్రమంగా ఆ టోలో రెండు క్వింటాళ్ల రేషన్‌బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. అలాగే, అదే గ్రా మ ంలో శంకర్‌ అనే వ్యక్తి ఇంట్లో రూ. 2వేలవిలువైన అక్రమ మద్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న డబ్బు, సెల్‌ఫోన్‌లు

శంకర్‌పల్లి: రాజేంద్రనగర్‌ ఎస్‌ఓటీ, శంకర్‌పల్లి పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శంకర్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని బుల్కాపురం శివారుల్లోని రఘురాం ఫామ్‌ హౌజ్‌లో పేకాట ఆడుతున్న 14మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి నుంచి రూ.1,24,260 నగదు, 13సెల్‌ ఫోన్‌లను సీజ్‌ చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బస్టాండ్‌లో చేపడుతున్న మరమ్మతులు



బస్టాండ్‌లో నిర్మిస్తున్న నీటి సంపు

లక్షలు ధారపోశారు.. లక్ష్యం మరిచారు!

రూ.లక్షలు ఖర్చుచేసి బస్టాండ్‌ను నిర్మించారు. కానీ లక్ష్యం మరిచారు. ఆర్టీసీ అధికారుల అలసత్వానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతుల పేరుతో అధిక నిధులు వెచ్చించి ఆధునిక హంగులు అద్దుతున్నారు. బస్సులే రాని బస్టాండ్‌కు సొబగులు ఎందుకని స్థానికులు చర్చించుకుంటున్నారు.

బస్టాండ్‌లో నిలపని బస్సులు

- మరమ్మతుల పేరుతో భారీగా ఖర్చు
- తీవ్ర ఇక్కట్లు పడుతున్న ప్రయాణికులు

పెద్దేముల్‌: పెద్దేముల్‌లో నూతనంగా నిర్మించిన బస్టాండ్‌లో బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం మధ్యలో ఉన్న పాత బస్టాండ్‌లో మాత్రమే బస్సులు నిలిపి కొత్త ప్రాంగణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో బస్సులు రాని బస్టాండ్‌కు మరమ్మతులు ఎందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో బస్టాండ్‌ మరమ్మతుకు దాదాపు రూ.12–15 లక్షల వరకు నిధులు మంజూరు చేశారు. దీంతో సీసీ రోడ్డుతో పాటు ఓ పక్కన ప్రహరీ గోడను నిర్మించారు. తప్పకుండా బస్సులు నిలిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు. వారంరోజుల పాటు హోంగార్డును పెట్టి బస్సులు ఆగేలా చూశారు. అనంతరం హోంగార్డును నిలిపివేయడంతో బస్సులు యథావిధిగా రావడం లేదు. ఈ విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయినా లాభం లేకుండా పోయింది. మళ్లీ కాంగ్రెస్‌ ప్రభుత్వంలో బస్టాండ్‌లో నీటి సంపుతోపాటు మరమ్మతులకు సుమారు రూ.లక్షన్నర పైగా నిధులు ఖర్చు చేస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు.

జనావాసాలు పెరిగాయి

ఆర్టీసీ అధికారులు ప్రాంగణంలోకి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నూతనంగా నిర్మించిన బస్టాండ్‌ గతంలో గ్రామానికి దూరంగా ఉండటంతో ప్రయాణికులు తక్కువగా వచ్చేవారు. ప్రస్తుతం దీని చుట్టూ ప్రభుత్వ కార్యాలయాలు, జూనియర్‌ కళాశాల భవనంతో పాటు జనావాసాలు భారీగా పెరిగాయి. బస్సులలో ప్రయాణం చేసే వారు సైతం అధికంగానే ఉన్నారు. వారికి ఈ కేంద్రమే అనువైనది. రాత్రి వేళల్లో లైట్లు లేక బస్టాండ్‌ అంధకారంలో ఉంది. దీంతో తాగుబోతులకు అడ్డాలుగా మారుతున్నందున లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అభ్యర్థిస్తున్నారు.

లైట్లు లేక తిప్పలు



పెద్దేముల్‌ నూతన బస్టాండ్‌లో లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. అలాగే గతంలో బస్సులను ఆపుతామని హామీ ఇచ్చిన ఆర్టీసీ అధికారులు ప్రస్తుతం పట్టించుకోవడం లేదు. జనాభా పెరగటంతో ప్రతి బస్సు బస్టాండ్‌లో నిలిపేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌, పెద్దేముల్‌

వసతి కల్పించాలి



నూతన బస్టాండ్‌లో ఆర్టీసీ శాఖ అధికారులు ప్రయాణికులకు తగ్గట్టుగా వసతులు కల్పించాలి. ప్రతి బస్సు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి. తాండూరు డిపోతో పాటు వికారాబాద్‌, సంగారెడ్డి బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలి.

– రాంరెడ్డి, రైతు, గిర్మాపూర్‌

చర్యలు తీసుకుంటాం



తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారిపై వచ్చే బస్సులను పెద్దేముల్‌ నూతన బస్టాండ్‌లో నిలిపేలా చర్యలు తీసుకుంటాం. అందుకు ఆదేశాలు జారీ చేస్తాం. చెప్పినా వినకపోతే వారి వేతనం కట్‌ చేస్తాం. ఇందుకు ప్రయాణికులు, గ్రామ ప్రజలు సహకారం కావాలి.

– సమత, ఆర్టీసీ డీఎం, తాండూరు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ఎమ్మెల్యే రంగారెడ్డితో కాలనీవాసులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్‌: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని వెంకటేశ్వర కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ కాలనీవాసులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులకు వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు ధన్‌రాజ్‌ గౌడ్‌, ఓబీసీ జాతీయ యువజన సంఘం ఉపాధ్యక్షుడు నరేష్‌, కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్‌, ఉపాధ్యక్షుడు శ్రీశైలం యాదవ్‌, కాలనీవాసులు పాండు, హరినాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి నిరంతరం కృషి

మాజీ మంత్రి హరీశ్‌రావు

షాబాద్‌: పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో షాబాద్‌ మండలం మాచన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ యూత్‌ కార్యదర్శి జైపాల్‌ తన పుట్టినరోజు సందర్భంగా హరీష్‌రావును కలిసి బొకే అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... పేద ప్రజల అభివృద్ధికి బీఆర్‌ఎస్‌ పార్టీ కృషి చేస్తుందన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధి కోసం తపిస్తున్న జైపాల్‌ను అభినందించారు. ప్రజలతో మమేకమవడంలో ఉన్న ఆనందం ఎంతో గొప్పదన్నారు.



హరీష్‌రావును కలిసి బొకే అందజేస్తున్న జైపాల్‌

అనంతపద్మనాభస్వామి సన్నిధిలో వంశీచంద్‌రెడ్డి

కొత్తూరు: సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి దంపతులు ఆదివారం మండలంలోని పెంజర్ల గ్రామంలోని అనంతపద్మనాభస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్‌ అనితారెడ్డితో పాటు స్థానిక కాంగ్రెస్‌ నాయకులు, వేదపండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు మామిడి సిద్ధార్థరెడ్డి, ప్రభాకర్‌, హరినాథ్‌రెడ్డి, మహేందర్‌, దయానంద్‌గుప్తా, సుధాకర్‌, రమేష్‌, సురేష్‌గౌడ్‌, రవికుమార్‌గుప్త పాల్గొన్నారు.



పూర్ణకుంభంతో స్వాగతం పలుకున్న నాయకులు

ముస్లిం మత పెద్దలతో పోలీసుల సమావేశం

పోలీసులకు సహకరిస్తామని వెల్లడి

అత్తాపూర్‌: ముస్లిం సోదరులు ప్రతి ఏటా ఘనంగా నిర్వహించుకునే ప్రధానమైన పండుగ రంజాన్‌ నిలుస్తుందని రాజేంద్రనగర్‌ డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌ అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఎంఎం పహాడి పింక్‌ రోజ్‌ ఫంక్షన్‌హాల్‌లో ముస్లిం మతపెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకునే రంజాన్‌ పండుగ ప్రత్యేకత చాటుకుందన్నారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేస్తూ.. మానవాళి మనుగడ కోసం ప్రార్థనలు చేయడం జరుగుతుందని వివరించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముస్లిం మత పెద్దలు ఒకరికొకరూ సహకరించుకుంటూ.. నెలరోజుల పాటు సాగే రంజాన్‌ వేడుకలు నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు. హిందువులు, ముస్లింలు అనే తారతమ్యం లేకుండా గత కొన్నేళ్లుగా జీవిస్తున్నామని మత పెద్దలు పేర్కొన్నారు. పోలీసులకు సహకరిస్తామని మత పెద్దలు ఈ సందర్భంగా వివరించారు. రాజేంద్రనగర్‌ ఇన్‌స్పెక్టర్‌ కె.శ్రీనివాస్‌, అత్తాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటరామిరెడ్డి, ఎస్సై శ్రీను, నాగరాజు, శ్రీనివాస్‌, నిమ్మల వెంకన్న, ఏఎస్సై మహ్మద్‌ అర్షద్‌ అలీ తదితరులున్నారు.



డీసీపీ, ఏసీపీలకు ఖురాన్‌ అందజేత

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ ఐబీ ప్యాలెస్‌లో ఆదివారం ముస్లిం మత పెద్దలు, వివిధ కాలనీలకు చెందిన ముస్లిం పెద్దలతో సమావేం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజేంద్రనగర్‌ డివిజన్‌ డీసీపీ శ్రీనివాస్‌ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... పవిత్ర రంజాన్‌ మాసాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా శాంతియుత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలన్నారు. ఏసీపీ శ్రీనివాస్‌, రాజేంద్రనగర్‌ ఇన్‌స్పెక్టర్‌ నాగేంద్రబాబుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ముస్లిం నాయకులు షాహిద్‌ పీర్‌, సుజాద్‌ఖాన్‌లు డీసీపీతో పాటు ఏసీపీలకు ఇంగ్లిష్‌లో ప్రచురించిన పవిత్ర ఖురాన్‌ను అందజేశారు.


విగ్రహ ప్రతిష్ఠాపనకు రండి



ఎంపీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గ్రామస్తులు

ఆమనగల్లు: మండలంలోని పోలెపల్లిలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఈనెల 20న నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి నాగర్‌ కర్నూల్‌ ఎంపీ రాములును ఆహ్వానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో పోలెపల్లి గ్రామానికి చెందిన పలువురు ఆలయ నిర్వాహకులు రాములును కలిసి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ ఒగ్గు లాలయ్య, నిర్వాహకులు దశరథం, కృష్ణయ్య, వెంకటయ్య, శివ, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని వ్యక్తి తల్లిదండ్రుల చెంతకు..



మతిస్థిమితం లేని వ్యక్తిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

మంచాల: మతిస్థిమితం లేని వ్యక్తి మంచాలలో తిరుగుతుండగా ఆదివారం పోలీసులు గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచాల మండలంలోని నోముల గ్రామంలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి తిరుగుతుండగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఆ వ్యక్తి వివరాలు సేకరించారు. అతని పేరు జోగి సుదర్శన్‌, తండ్రి లక్ష్మణ్‌, గ్రామం కంస్తూర్‌ పల్లి, కొడంగల్‌ మండలం, వికారాబాద్‌ జిల్లా అని తెలిపాడు. దీంతో మంచాల పోలీసులు కొస్గి పోలీసుల సహకారంతో అతని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు మంచాల పోలీసుస్టేషన్‌కు వచ్చి తమ కుమారుడైన జోగి సుదర్శన్‌ను తీసుకొని వెళ్లారు. మంచాల పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రవినాయక్‌ కానిస్టేబుల్‌ మల్లేశ్‌ తదితరులు పాల్గొన్నారు.